

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళంక్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 16 దుకాణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత ఈ నెల 5వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, తాజాగా, దీన్ని ఈ నెల 8వ తేదీ సాయంత్ర 5 గంటల వరకు పెంచిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ పద్ధతిలో చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టుకోండి చూద్దాం!

- పోలీసులకు సవాల్‌గా దొంగలు
- పట్టుబడుతున్నది కొందరే..
- జిల్లాలో పెరుగుతున్న చోరీలు
- పోలీసు శాఖలో సిబ్బంది కొరత



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా బీభత్సం సృష్టిస్తున్నారు. ఇళ్లు, షాపులు, వాణిజ్య సముదాయాలు, చివరకు పొలాల్లో ఉన్న మోటార్లు, ఇంజన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం చోరీ చేస్తున్నారు. జిల్లాలో రోజూ ఏదో మూలన దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేస్తున్న పోలీసులు విచారణలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా మీదుగా నేషనల్ హైవే, అంతర్ రాష్ట్ర రహదారులు, రైలు మార్గం ఉండడం దొంగతనాల పెరుగుదలకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఒడిశాతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ముఠాలు జిల్లాలో ప్రవేశించాయన్న హెచ్చరికలు పోలీసులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో రాత్రిపూట వాహన తనిఖీలు, గస్తీలను ముమ్మరం చేశారు.

సిబ్బంది కొరత..

జిల్లా పోలీస్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 42 పోలీసు స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు సీసీఎస్, మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు కొనసాగుతున్నాయి. బి-గ్రేడ్ స్థాయికి చెందిన శ్రీకాకుళం వన్‌టౌన్, టూటౌన్, సీ గ్రేడ్ స్థాయిలో ఉన్న కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్లలో (మిగతా 6వ పేజీలో...)

- గత నెల 24 అర్ధరాత్రి వజ్రపుకొత్తూరు మండలం పూండిలో దొంగల ముఠా బీభత్సం సృష్టించింది. ఐదుగురు దొంగలు బంగారు షాపులను టార్గెట్‌గా చేసుకుని చోరీకి తెగబడ్డారు. సుమారు 10 కిలోల వెండి, తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయింది.
- గత ఏడాది సెప్టెంబరు 30న కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద రూ.9 లక్షల విలువ చేసే 9 వేల ఇత్తడి ట్యాపులను దొంగలు అపహరించారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా వివిధ గ్రామాల్లో ట్యాపులు వేసేందుకుగాను పాకివలస వద్ద ఓ షాపులో ట్యాపులను ఉంచగా దొంగలు రాత్రి సమయంలో చోరీ చేశారు. ఈ కేసును పదిరోజుల్లోనే పోలీసులు ఛేదించి దొంగల ముఠాను అరెస్టు చేశారు.
- గత ఏడాది డిసెంబరులో గార మండలం ట్రైమాక్స్ కంపెనీలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ మాయమైంది. సుమారు రూ.27 లక్షలు విలువ చేసే కాపర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు ముగ్గురు ముఠా సభ్యులను అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మూతపడిన పరిశ్రమలను టార్గెట్ చేసుకుంటూ ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు.
- గత ఏడాది సెప్టెంబరు 9న శ్రీకాకుళం కళింగరోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు దుండగులు. సీసీ కెమెరాల డైరెక్షన్ మార్చి తెరిచే ప్రయత్నం చేశారు. ఒకరు కాపలాగా ఉండగా.. మరొకరు తెరిచే ప్రయత్నం చేశారు. రాత్రి గస్తీలో ఉన్న పోలీసులు అక్కడకు వచ్చేసరికి ఇద్దరూ పరారయ్యారు.



వారిని వదిలేస్తున్నారు?

- కేవలం బెల్టుదుకాణాల నిర్వాహకులపైనే కేసులు
- మద్యం సరఫరా చేసే వ్యాపారులను విడిచిపెడుతున్న వైనం
- ఎక్సైజ్, పోలీసు అధికారుల తీరుపై విమర్శలు



పలాసలో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు (ఫైల్)

సోంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో బెల్టు షాపులపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిత్యం దాడులు చేస్తూ నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇది బాగానే ఉన్నా ఈ బెల్టుషాపులకు సరుకు సరఫరా చేసే మద్యం వ్యాపారులపై మాత్రం ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబే బెల్టు షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలని, అదేసమయంలో ఆ మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో తెలుసుకుని ఆ యజమానిపై కూడా కేసు పెట్టాలని ఆదేశించారు. మొదటిసారి పట్టుబడితే అపరాధ రుసుం విధించాలని, రెండోసారి దొరికితే ఏకంగా ఆ వైన్‌షాపు లైసెన్స్ రద్దుచేయాలని ఆదేశాలిచ్చారు. కానీ, జిల్లాలో ఆ ఆదేశాలు అమలు కావడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో వేల సంఖ్యలో మద్యం సీసాలు పట్టుబడ్డాయి. అయితే, దీనికి సంబంధించి కేవలం బెల్టు నిర్వాహకులపైనే కేసులు నమోదు చేసి మద్యం వ్యాపారులను వదిలేశారు. ఇప్పటి వరకు ఒక్క మద్యం దుకాణంపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మద్యం సీసాలు ఏ షాపు నుంచి కొనుగోలు చేస్తున్నారో బయటకు పొక్కకుండా జాగ్రత్తపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం వ్యాపారుల అండతోనే బెల్టు షాపులు వెలుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు వారు బెల్టు దుకాణాలకు సరుకును సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణానికి దూరంగా ఉన్న గ్రామాలను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఉదాహరణకు.. సోంపేట మండల కేంద్రంతో పాటు కొర్లాంలో లైసెన్స్‌డ్ మద్యం షాపులు ఉన్నాయి. ఈ షాపులు పట్టణ శివారు ప్రాంతాలైన బాతుపురం, పొత్తంగి, ఏడూళ్లపాలెం తదితర గ్రామాలకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. అంత దూరం నుంచి మందుబాబులు ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు. దీన్ని గుర్తించిన మద్యం వ్యాపారులు తమ అనుచరుల ఇళ్లలో రహస్యంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. రూ.150 విలువ చేసే క్వార్టర్ సీసాను రూ.200కు విక్రయించి మందుబాబులను దోచుకుంటున్నారు. మరికొన్ని చోట్ల బెల్టుషాపుల కోసం బహిరంగ వేలం సైతం నిర్వహించిన ఘటనలు వెలుగు చూశాయి. టెక్కలి డివిజన్ బూరగాంలో రూ.3లక్షలకు, శాసనాంలో రూ.లక్షకు బెల్టుషాపులను కొందరు దక్కించుకున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టుషాపుల నిర్వాహకులతో పాటు వారికి మద్యం సరఫరా చేసే వ్యాపారులపై కూడా కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అప్పుడే బెల్టు దుకాణాలకు పూర్తిగా అడ్డుకట్టపడుతుందని అంటున్నారు.

- గత నెల 2న ఇచ్ఛాపురం మండలం ఈదుపురం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై 25 మద్యం సీసాలతో వస్తుండగా పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కానీ, ఆ వ్యక్తికి మద్యం సీసాలను విక్రయించిన వ్యాపారస్తుడిపై చర్యలు లేవు.
- గత నెల 6న పలాస పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద బైక్‌పై 62 మద్యం సీసాలను తరలిస్తున్న వజ్రపుకొత్తూరు మండలానికి ఇద్దరి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పలాసలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి బెల్టు షాపులో విక్రయానికి వారు తరలిస్తున్నట్లు గుర్తించారు. అయితే, వీరు కొనుగోలు చేసిన మద్యం షాపు పేరు బయటకు రాలేదు.
- ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో గత నెల 6న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె నుంచి 76 బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళ ఈ మద్యం సీసాలను ఎక్కడి నుంచి కొనుగోలు చేసి తెచ్చిందో తెలియలేదు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):వచ్చే నెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. కక్షిదారులు న్యాయవాదులతో మాట్లాడాలన్నారు. ఇరు పార్టీలూ రాజీ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ఇది చక్కని అవకాశమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

12న కుంభమేళాకు ఆర్టీసీ సర్వీసు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

అరసవల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఈ నెల 12న ప్రత్యేక ఆర్టీసీ బస్సును నడపనున్నట్లు సంబంధిత అధికా రులు తెలిపారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కార్యాలయంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుంభమేళా యాత్ర కోసం సరికొత్త సూపర్ లగ్జరీ (పుష్ బ్యాక్) బస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 7 రోజుల్లో 7 క్షేత్రాలను సందర్శించే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రయాణికులకు మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం అందిస్తామన్నారు. ఇప్ప టికే టిక్కెట్లు రిజర్వ్ అయ్యాయని, మరో 20 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని చెప్పారు. బస్సును బుక్ చేసుకుంటే ఇంటి వద్దకే పంపిస్తామన్నారు. మనిషి ఒక్కరికి రూ.9,500 చార్జీగా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు 9959225609, 7382917289, 7382921647, 7382921810 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్లు అమరసింహుడు, కె.రవిశంకర్ శర్మ, ఏఎస్ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘ఘనుల’ కోసం ఆరా

- గ్రానైట్ క్వారీ లీజు వివరాల సేకరణ
- వైసీపీ అక్రమాలపై గనుల శాఖ దృష్టి

6లో

కాలువ కప్పేసి.. ఇసుక తరలింపు

- వంద ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నీరందని వైనం
- ఆందోళన చెందుతున్న 4ఆర్ కాలువ రైతులు

8లో

విరిగిన వీల్‌చైర్స్.. చిరిగిన పరుపులు

- జిల్లా కేంద్రాసుపత్రిలో అరకొరగా సేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు
- మంత్రి అచ్చెన్న ఆదేశించినా మారని తీరు



- నందిగాం మండలం మాదిగాపురానికి చెందిన రోణంకి నారాయణరావు అనారోగ్యంతో గత నెల 31 జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చాడు. వైద్యసేవలు కోసం మరమ్మతులకు గురైన వీల్‌చైర్‌పైనే కూర్చొని కనిపించాడు.



బెడ్‌షీట్లు లేకపోవడంతో చిరిగిన పరుపుల పైనే చికిత్స పొందుతున్న రోగులు

టెక్కలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో వీల్‌చైర్స్ లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇది 200 పడకల ఆస్పత్రి. కానీ ఆ స్థాయిలో వీల్‌చైర్స్ లేవు. కొన్నింటికి పుట్‌రెస్ట్‌లు విరిగిపోయాయి. మరోవైపు రోగులు మంచాలకు పరిపడా బెడ్‌షీట్స్ లేవు. కొన్ని చిరిగిన పరుపులే దర్శనమిస్తున్నాయి. ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ ఆస్పత్రికి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఇబ్బందులను తెలుసుకున్నారు. వీల్‌చైర్స్ కొనుగోలు చేయాలని, లేదా మండలపరిషత్ కార్యాలయంలో వృథాగా ఉన్న వీల్‌చైర్స్ అయినా తెచ్చి వినియోగించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. అయినా ఆ దిశగా సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది చర్యలు చేపట్టడం లేదు. దీంతో పాడైన వీల్‌చైర్‌లే దిక్కవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోగుల మంచాలపై బెడ్‌షీట్లు పూర్తిస్థాయిలో వేయాలని మంత్రి అచ్చెన్న ఆదేశించినా.. ఆచరణ శూన్యమని వాపోతున్నారు. చిరిగిన పరుపులనే వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు. మంత్రి, అధికారుల తనిఖీల సమయంలో.. సిబ్బంది ఠాగూర్ సినిమా తరహాలో చకచకా బెడ్‌షీట్లు మంచాలపై కప్పేస్తుంటారు. తర్వాత మాత్రం పట్టించుకోరనే ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై చర్యలకు ఉపక్రమిస్తే తప్ప ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిలో మార్పు రాదని పేర్కొంటున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు వద్ద ప్రస్తావించగా ఆసుపత్రికి అవసరమైన వీల్‌చైర్స్ ఉన్నాయని, మరో ఐదు వీల్‌చైర్స్ రిజర్వ్‌లో ఉంచామన్నారు. రోగులకు సరిపడా బెడ్‌షీట్లు ఉన్నాయని, ఇటీవల 200కు పైగా కొత్తవి కొనుగోలు చేశామని తెలిపారు.



- కోటబొమ్మాళికి చెందిన మురపాక బారికివాడు.. కాళ్ల నొప్పితో బాధపడుతూ గతనెల 31న జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు ఆయన వీల్‌చైర్‌పై సీటీస్కాన్ విభాగం వద్దకు వెళ్లాడు. ఆ వీల్‌చైర్‌కు కనీసం ఫుట్‌రెస్ట్‌లు లేవు. ఫుట్ రెస్ట్ బదులు ఓ తాడు కట్టి ఉండడంతో కూర్చోవడానికి మరింత ఇబ్బంది పడ్డాడు.



- నందిగాం మండలం దీనబంధుపురం గ్రామానికి చెందిన అడపా ధర్మారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకున్నాడు. వైద్యుల సూచన మేరకు అక్కడ నుంచి ఎక్స్‌రే విభాగానికి చేరుకోవడానికి వీల్‌చైర్ సౌకర్యం లభించక ఇబ్బంది పడ్డాడు. ఇద్దరు వ్యక్తుల సహాయంతో కుంటుతూ ఎక్స్‌రే గదికి చేరుకున్నాడు.



కౌజు పిట్ట.. జీవితాన్ని మార్చేసింది!

- వీటి పెంపకంతో ఉపాధి
- సవర చీపురుపల్లి యువకుడి ప్రయత్నం

మెళియాపుట్టి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):

ఆయన మారుమూల గ్రామానికి చెందిన యువకుడు. డిగ్రీ చదువుకున్నాడు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా.. స్వయంగా ఉపాధి పొందుతూ.. నలుగురికీ ఉపాధి కల్పించాలని యోచించాడు. ఆ దిశగా అడుగులు వేశాడు. తక్కువ పెట్టుబడితో ఆదాయం వచ్చే వ్యాపారం కోసం అన్వేషించాడు. అతని ప్రయత్నం ఫలించింది. ఇప్పుడు తనతో పాటు కుటుంబ సభ్యులు అందరూ ఉపాధి పొందుతున్నారు. కౌజు పిట్టల వ్యాపారంతో ఆదాయం సమకూర్చుకుంటున్న ఆ యువకుడే మెళియాపుట్టి మండలం సవర చీపురుపల్లి గ్రామానికి చెందిన సవర రామారావు.

మొదట 10 కౌజు పిట్టలను కొనుగోలు చేసి.. పెంపకం చేపట్టాడు. నెల రోజుల్లో రూ.1000 లాభం వచ్చింది. ఆ తరువాత మరో 100 పిట్టలు పెంచాడు. మంచి లాభం రావటంతో సుమారు రూ.3 లక్షలు పెటుబడి పెట్టి ఒక షెడ్ నిర్మించాడు. ప్రస్తుతం 1000 పిట్టలు పెంచుతూ లాభాలు ఆర్జిస్తున్నట్టు చెబుతున్నాడు. మూడు నెలలుగా కౌజు పిట్టలు పెంచుతున్నట్టు తెలిపాడు. శ్రీకాకుళం సమీపంలో ఉండే కొత్తపేటలో ఒక్కొక్క గుడ్డు రూ.15 చొప్పున కొనుగోలు చేస్తున్నాడు. ఇవి పిల్లలయ్యాక... మేతను బట్టి 30 నుంచి 40 రోజుల్లోపు సుమారు వంద గ్రాముల వరకు బరువు పెరుగుతున్నట్టు వివరించాడు.

కిలో రూ.650..

కౌజు పిట్టలను ఆయన కిలో రూ.650కి ఇస్తుండగా... బయట మార్కెట్‌లో రూ.1000 నుంచి రూ.1200 వరకు అమ్ముతున్నారు. కిలోకి 8 పిట్టలు వస్తున్నట్టు రామారావు చెబుతున్నాడు. కొంత మంది ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులతో పాటు హోటల్ యజమానులు పౌల్ట్రీకి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న దాబాల్లో కౌజు పిట్టల మాంసాన్ని ఎక్కువగా పెడుతుంటారు. దీంతో వీటికి డిమాండ్ అధికంగా ఉంటోంది.



కౌజు పిట్టలు

రోజుకు రూ.2,500 ఖర్చు..

ప్రతి రోజు 1000 పిల్లలకు దాణా కోసం రూ.2,500 వంతున ఖర్చు చేస్తున్నట్టు రామారావు తెలిపారు. ప్రతి నెల 1500 కిలోల పిట్టలు వస్తున్నాయని... వీటి ద్వారా రూ.9 లక్షల వరకు ఆదాయం వస్తోందని తెలిపారు. పూర్తిగా ఆర్గానిక్ మేత పెడుతున్నట్టు చెప్పారు.

పెట్టుబడి లేక విస్తరించలేకపోతున్నా..



కౌజు పిట్టల పౌల్ట్రీని విస్తరించాలని ఉన్నా పెట్టుబడి లేక తక్కువ పిట్టలు పెంచుతున్నాను. ఐటీడీఏ ద్వారా రుణం ఇవ్వగలిగితే మా గ్రామంలో మరి కొంతమందికి ఉపాధి కల్పించగలను. నా కాళ్లపై నిలబడి... కుటుంబాన్ని పోషించుకోవాలనే ఉద్దేశంతో కౌజు పిట్టలను పెంచుతున్నాను.

-సవర రామారావు

కుటుంబమంతా కష్టపడుతున్నాం..



కుటుంబమంతా కష్టపడి.. కౌజు పిట్టల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్నాం. మా వద్ద ఆర్థిక వనరులు లేవు. ప్రభుత్వం రుణం ఇప్పించగలిగితే మరింత మందికి ఉపాధి చూపించగలం.

-సవర రేఖ, సవర చీపురుపల్లి

పట్టుకోండి చూద్దాం!

(ఐదో పేజీ తరువాయి)

సిబ్బంది కొరత ఉంది. జిల్లా పోలీస్ శాఖలో శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ డివిజన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీలు ముగ్గురు, డీఎస్పీలు 13 మంది శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 12 సర్కిళ్లకుగాను 22 మంది సీఐలు, 120 మంది ఎస్ఐలు, 138 మంది ఏ ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు 365 మంది, కానిస్టేబుళ్లు 1,200 మంది విధులు నిర్వహిస్తున్నారు. 850 మంది హోంగార్డులు సేవలందిస్తున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 14,000 మంది కానిస్టేబుల్ కొరత ఉన్నట్టు పోలీస్ యంత్రాంగం చెబుతోంది. జిల్లాలో వెయ్యి మంది కానిస్టేబుళ్లను నియమిస్తే కానీ అన్ని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత తీరదని అధికారులు చెబుతున్నారు. కొత్త కానిస్టేబుళ్లు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు.



నిఘా పెంచాం..



దొంగతనాల నియంత్రణకు ప్రత్యేకంగా దృష్టిసారించాం. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచాం. ఇతర ప్రాంతాల నుంచి ముఠాలు ప్రవేశిస్తున్నాయన్న హెచ్చరికలతో అప్రమత్తమయ్యాం. రహదారుపై తనిఖీలు చేపట్టాం. రాత్రిపూట గస్తీని సైతం పెంచాం.

-మీసాల చిన్నమనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

అందుబాటులో సీసీ కెమెరాలు, డ్రోన్లు..

జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు పోలీస్ శాఖ చెబుతోంది. గత ఐదేళ్ల పాటు సీసీ కెమెరాల ఏర్పాటులో అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 994 కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. పెద్ద ఎత్తున సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్లు సైతం అందు బాటులోకి వచ్చాయి. అయితే సిబ్బంది కొరత మూలంగానే ఇబ్బందులు ఉన్నాయి. ప్రస్తుతం కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ జరుగుతోంది. పూర్తయిన వెంటనే మరికొన్ని అదనపు పోస్టులు భర్తీ అవుతాయని పోలీస్ శాఖ చెబుతోంది. దొంగతనాలతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు పోలీస్ శాఖ చెబుతోంది.

ఆకాశవీధిలో... విహరించు వేళలో!

- హెలికాప్టర్‌లో నగర వీక్షణం
- ప్రజలకు కొత్త అనుభూతి

'మా ఇల్లు ఇక్కడ ఉంటుందా? ఆ కొండలు ఎక్కడివో.. అదిగదిగో అదే శాలిహుండం అనుకుంటా... అదిగో అరసవల్లి ఆలయం... ఊరు ఎంత చిన్నగా కనబడుతోందో..' ఇవీ వినువీధిలో హెలికాప్టర్‌లో విహరిస్తున్న వారి మాటలు. రథసప్తమి ఉత్సవాలలో భాగంగా నాలుగు రోజులుగా హెలికాప్టర్ టూరిజాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు హెలికాప్టర్‌లో విహారానికి మక్కువ చూపారు. ఆకాశం నుంచి శ్రీకాకుళం నగరాన్ని... పరిసర ప్రాంతాలను తిలకించి... పులకించిపోయారు.

-శ్రీకాకుళం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి)



ఘనుల కోసం ఆరా!

- కోటబొమ్మాళి మండలం దంత పరిధి సర్వే నెం.46లో చిన్మయి గ్రానైట్స్ సంస్థ ఐదు హెక్టార్ల క్వారీ లీజుకు అప్పట్లో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. అంతవరకూ ఉన్న పద్ధతిని కాదని... వైసీపీ ప్రభుత్వ హయాంలో గనుల శాఖ అధికారులు క్వారీ లీజును వేలంతో ముడిపెట్టారు. దీంతో ఆ యజమాని హైకోర్టును ఆశ్రయించారు.
- నందిగాం మండలం సొంటినూరు సర్వే నెం.1లో సుమారు ఐదు హెక్టార్లలో గ్రానైట్ లీజుకు అప్పటి ప్రభుత్వ అదనపు న్యాయవాదిగా పనిచేసిన పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డికి 78 రోజుల్లో లీజులు కేటాయిస్తూ అనుమతులు జారీ చేశారు.



టెక్కలి ప్రాంతంలోని గ్రానైట్ క్వారీ

- గ్రానైట్ క్వారీ లీజు వివరాల సేకరణ
- వైసీపీ అక్రమాలపై గనుల శాఖ దృష్టి

టెక్కలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి)

..ఇదీ గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రానైట్ క్వారీ లీజుల తీరు. 'వడ్డించే వాడు మనవాడైతే...' అన్న నానుడిని అక్షరాలా పాటించి చూపారు. ప్రస్తుతం ఇలాంటి అడ్డగోలు వ్యవహారాల వివరాలు సేకరించే పనిలో సంబంధిత అధికారులు పడ్డారు. దీంతో పాత కథలు బయటకు వస్తున్నాయి. సామాన్యులు... ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులు క్వారీలకు దరఖాస్తు చేసుకుంటే... వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలం విధానాన్ని అనుసరించారు. దరఖాస్తు చేసుకున్న జియో కో-ఆర్డినేట్స్ పాయింట్ల ఆధారంగా క్వారీ లీజులు వేలం పేరిట మంజూరు చేశారు. వాస్తవానికి గనుల శాఖ అధికారులు కొత్తగా దరఖాస్తు చేసుకున్న క్వారీ ప్రాంతానికి వెళ్లి.. సర్వే చేసి లీజుకు అనుమతులలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ దీనికి భిన్నంగా కథ నడిపారు. వేలంలోనూ నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. అధికారులకు నచ్చినట్టు కేటాయింపులు ఉండేవి.

వివరాలు ఆరా..

గత ప్రభుత్వ హయాంలో గనుల శాఖ నడిపిన అడ్డగోలు వ్యవహారాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రానైట్ క్వారీలకు లీజులకు దరఖాస్తు చేసుకున్నది ఎవరు? కేటాయింపులు ఏవిధంగా జరిగాయి? వంటి వివరాలను ఆ శాఖ కమిషనర్ కార్యాలయం ఆరా తీస్తోంది. గతంలో అడ్డగోలుగా లీజులు పొందిన పలువురు గ్రానైట్ క్వారీలను నిర్వహించకుండా వదిలేశారు. తాజాగా గనుల శాఖ ఉన్నతాధికారులు లీజుల కేటాయింపు వివరాలపై ఆరా తీస్తుండడంతో గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరూ తమ వివరాలను వెల్లడించే పనిలో పడ్డారు. గ్రానైట్ క్వారీల లీజుల ఆరా వ్యవహారమై ఆ శాఖ ఏడీ విజయలక్ష్మి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా గ్రానైట్ క్వారీ లీజుల వివరాలు నవీకరణ కోసం సేకరిస్తున్నట్టు చెప్పారు.

జిల్లా బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక

- 9న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పి.ఎస్.ఎన్.ఎం. స్కూలు క్రీడా మైదానంలో ఈ నెల 9వ తేదీన మిస్టర్ ఆంధ్రా బాడీబిడ్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. దీనిలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రైవేట్ జిమ్‌లో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఆమదాలవలసకు చెందిన రాయి హరీష్ (55 కేజీలు), శ్రీకాకుళం నుంచి శరత్ చంద్ర (65 కేజీలు), కల్యాణ్ (60 కేజీలు), మోహన్, ఇబ్రహీంలను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రూ.1.25 లక్షల నగదు బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, కె.గౌరీశంకర్, శంకర్ యాదవ్, జీవన్, విష్ణు ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడండి

- డీఎస్పీ వివేకానంద

గార, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలుని యాత్రలో భక్తులకు అసౌకర్యం కలుగ కుండా చూడాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడు నిర్వాహకులకు సూచించారు. శాలిహుండం కొండపై భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ నెల 8న జరుగనున్న యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం వారు పరిశీలించారు. కొండపై వేణుగోపాల స్వామిని భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శించుకునేలా చూడాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులు కొండపైన, కింద యాత్రా స్థలంలో కూడా అసౌకర్యానికి గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆలయ సిబ్బందికి సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్‌తో పాటు ట్రాఫిక్ సమస్య లేకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ మధురెడ్డి మాట్లాడుతూ యాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీని కోరారు. అనంతరం కొండపైన క్యూలైన్లు, బారికేడ్లను డీఎస్పీ పరిశీలించారు. కొండ కింద యాత్రా స్థలం, వాహనాల పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గార ఎస్.ఐ. ఆర్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



క్యూలైన్లు పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద

కమ్మసిగడాం జాతరకు పటిష్ఠ బందోబస్తు

- రేపటి నుంచి అమ్మవారి ఉత్సవాలు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

రణస్థలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీ నుంచి జరిగే కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారి జాతరలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు జేఆర్‌పురం సీఐ అవతారం తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలలో 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలి పారు. భక్తుల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం కేటాయించినట్టు వివరించారు. ఇష్టానుసారంగా ఆటోలు పార్కింగ్ చేస్తే రూ.2000 వరకూ అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. జాతర సమయంలో నెల్లిమర్ల వైపు వెళ్లే పెద్ద వాహనాలను పైడిభీమవరం నుంచి సంచాం మీదుగా మళ్లించనున్న ట్టు వివరించారు. జాతరలో డ్రోన్‌లతో పర్యవేక్షించనున్నట్టు సీఐ తెలిపారు. మహిళా భక్తులను ఆకతాయిలు ఇబ్బంది పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్ చిరంజీవి పాల్గొన్నారు.



కమ్మసిగడాం జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

జాతర ఏర్పాట్ల పరిశీలన..

అమ్మవారి జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం రాత్రి పరిశీలించారు. భక్తులకు సులభంగా దర్శనమయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, బుజ్జి, వెలిచేటి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా రథసప్తమి వేడుకలు

- వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహిస్తాం
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు.శంకర్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత, అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి విజయవంతంగా నిర్వహించడం జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు నిరంతం శ్రమించారని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషి ప్రసంశనీయమని కొనియాడారు. స్వామివారిని సుమారు 1.20 లక్షల మంది దర్శించుకున్నారని, మరో లక్ష మంది వేడుకలు చూసేందుకు వచ్చారన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు అందించిన సేవలు మరువలేనివని, వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. మూడు రోజుల రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి జిల్లా ప్రజలు రుణపడి ఉంటామని, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు ప్రతీరోజు ఫోన్‌లో వేడుకల ఏర్పాట్లను సమీక్షించేవారని, వారి సహకారం వెలకట్టలేనిదన్నారు. జిల్లా చరిత్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబేంచేలా ఏర్పాటు చేసిన లేజర్ షో, హెలికాప్టర్‌లో ఆకాశ విహారం వంటి వినూత్న కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. నగరాన్ని అతి తక్కువ సమయంలో సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించామని, నేటి నుంచే నగర సుందరీకరణ పనులను మరలా ప్రారంభించామని, అందరి ఆశీస్సులతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి రథసప్తమి ఆదాయం రూ.70.39 లక్షలు

- గతేడాది కంటే రూ.19.48 లక్షలు అధికం
- 90వేల మందికిపైగా ఉచితదర్శనాలే..

స్వామివారి ఆదాయ వివరాలు ఇలా.. (రూ.లలో)

వివిధ రకాల టిక్కెట్లు	విక్రయించిన టిక్కెట్లు	గతేడాది ఆదాయం	ఈ ఏడాది ఆదాయం
ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.100)	17,720	7,43,000	17,72,000
విశిష్ట దర్శనం (రూ.300)	10,692	16,28,500	32,07,600
క్షీరాభిషేకం (రూ. 500)	2,994	12,00,000	14,97,000
కేశఖండన (రూ.40)	1,100	48,760	44,000
లడ్డూ ప్రసాదం(రూ.15)	18,425	6,54,360	2,76,375
పులిహోర ప్రసాదం (రూ.10)	22,540	7,58,220	2,25,400
డొనేషన్	--	57,690	19,933
మొత్తం	--	50,90,530	70,39,308

శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(ఆంధ్ర జ్యోతి): ఆరోగ్య ప్రదాత, అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి సందర్భంగా రూ.70.39 లక్షలు ఆదాయం లభించింది. గతేడాది కంటే ఆదాయం రూ.19.48 లక్షలు అధికం. మంగళవారం వేకువ జాము నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకున్నవారు.. ప్రసాదాల విక్రయాలు.. ఇలా టిక్కెట్ల రూపంలోనే వచ్చిన ఆదాయ వివరాలను ఆలయ అధికారులు బుధవారం రాత్రి వెల్లడించారు. అయితే మొత్తం ఆదాయం పెరిగినా.. ప్రసాద విక్రయాల్లోనూ, తలనీలాల టిక్కెట్ల విక్రయాల్లో గతేడాది కంటే ఆదాయం గణనీయంగా తగ్గింది.

ఉచిత దర్శనానికే ఎగబడిన జనం..

అధికారుల అంచనా ప్రకారం స్వామివారిని దర్శించుకున్నవారిలో ఉచిత క్యూలైన్లలో 90వేలకు మంది వరకు ఉన్నారని గుర్తించారు. రథసప్తమి రోజు సాయంత్రం నుంచి క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా.. క్యూలైన్లు పెరిగిపోకుండా భక్తులందరినీ అన్ని లైన్లలోకి విడిచిపెట్టేశారు. దీంతో ఉచిత దర్శనాలే అధికంగా జరిగాయి. టిక్కెట్లు తీసి స్వామివారిని దర్శించున్నవారి సంఖ్య కేవలం 34,400 మంది మాత్రమే. అలాగే ప్రసాద విక్రయాల విషయంలో గందరగోళం తలెత్తింది. మంగళవారం ఉదయం వేకువ జామున 4 గంటల వరకు ప్రసాదం ఎక్కడ విక్రయించాలన్నదీ స్పష్టతలేకపోయింది. ఆ తర్వాత అరసవల్లికి వెళ్లే మార్గంలో పెట్రోల్ బంకు సమీపంలో ప్రసాదాన్ని విక్రయించారు. ఆ విషయం తెలియక భక్తులు.. ఇతర స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే ప్రసాదాన్నే స్వీకరించారు. దీంతో ప్రసాద విక్రయ కేంద్రాన్ని తోట జంక్షన్ వద్దకు మార్చుచేశారు. అయినప్పటికీ గతం కంటే ఈసారి ప్రసాద విక్రయాల ఆదాయం మాత్రం భారీగా తగ్గింది.

నేడు పరిశుభ్రత కార్యక్రమం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో గురువారం శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, నాగావళి రివర్ వ్యూ పార్క్‌లను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శుభ్రం చేయనున్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మార్గదర్శకాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ తెలిపారు. వర్సిటీ నుంచి ఏడు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, అలాగే శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాల నుంచి చెరో రెండు, ఆదిత్య, కాకినాడ ఆదిత్య కళాశాలల నుంచి చెరో ఒక ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9.30 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ప్రారంభిస్తారన్నారు.

నులిపురుగుల మాత్రలు వేయించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను ఈ నెల 10వ తేదీన తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని వారికి అవగాహన కల్పించాలన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 10న డీవార్మింగ్ డే, 17న మ్యాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వాటిని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల పిల్లలకు పూర్తి మాత్రలు వేయించాలన్నారు. ప్రతీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత ప్రతీ విద్యార్థికి మాత్రను వేయించాలన్నారు. ఆరోగ్యశాఖ, వైద్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో 4,46,982 మందికి మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా 5లక్షలకు పైగా మాత్రలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఈవో తిరుమల చైతన్య, డీపీఎంవో బి.రవీంద్ర, డెమో వెంకటేశ్వరరావు పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బెంతుఒరియా సంఘం నూతన కార్యవర్గం

కవిటి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బెంతుఒరియా కులసంఘం జిల్లా అధ్యక్షుడిగా రజనీకుమార్ దొళాయి ఎన్నికయ్యారు. ఈమేరకు బుధవారం బల్లిపుట్టుగ వద్ద కులస్థులంతా కలిసి నిర్వహించిన సమావేశంలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా డిల్లీ మజ్జి, కార్యదర్శిగా గొంగాధర్ సాహు, గౌరవ అధ్యక్షుడిగా మోహన్ సాహులను ఎన్నుకున్నారు. కులస్థులకు న్యాయం జరిగేందుకు తమవంతుగా బాధ్యతగా పనిచేస్తామని తెలిపారు.

మృతురాలి కుటుంబానికి సాయం

జి.సిగడాం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నిద్దాం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కెంబూరి చంద్రకళ విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందింది. ఆ కుటుంబానికి బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి రూ.10వేలు సాయాన్ని అందజేశారు. కూటమి నాయకులు వజ్జపర్తి రఘురాం, మీసాల రవికుమార్ తదితరులు ఉన్నారు. అలాగే సంతవురిటి గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. నాయకులు మీసాల రవికుమార్, ఎర్నేన శ్రీనివాసరావు, ఏఎన్ఎం పద్మావతి ఉన్నారు.

చెత్త తొలగింపు

గార, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్వేతగిరి (శాలిహుండం)లో ఈ నెల 8న జరగనున్న యాత్రా స్థలం వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెత్తకుప్పలను బుధవారం ఉదయం అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. ఇక్కడ చెత్త కుప్పలు కుప్పలుగా ఉన్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో గత నెల 31న వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. అక్కడ చెత్త కుప్పలు తొలగింపు చేపట్టడంతో యాత్రికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెత్తకుప్పలు తొలగించిన దృశ్యం →



ఎమ్మెల్యేకి పదవిపై అభినందనలు


ఎమ్మెల్యే రవికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ ఛైర్మన్‌గా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎంపిక కావడంపై పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న రవికుమార్‌కు ఇటువంటి పదవి అప్పగించడం వల్ల ఎంతో బాధ్యతతో పనిచేస్తానన్నారు. పీయూసీ ఛైర్మన్‌గా రవికుమార్ ఎంపిక చేయడంపై పార్లమెంటరీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ చాపర సుధాకర్, ఆమదాలవలస కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. ఈ బాధ్యతను అప్పగించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సన్మానించారు.

యువత రక్షణ దళంలో చేరాలి

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యావంతులైన యువకులు దేశ రక్షణదళంలో చేరడానికి బాధ్యతగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారి సైరిగాపు మోహనరావు అన్నారు. బుధవారం షలంత్రి పంచాయతీ తన స్వ గ్రామమైన మర్రిపాడు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీరామ యువజన సంఘం ప్రతినిధులు ఎడ్ల మన్మథరావు, కొల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యువత ఆయన్ని ఘనంగా సన్మానించారు. చిన్న గ్రామం నుంచి స్వయం కృషితో పోలీస్‌శాఖలో ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామంలో ప్రతి అవసరానికి తనవంతు సహకారాన్ని అందిస్తున్న మోహనరావు ఆదర్శంగా నిలుస్తారని జిల్లా తూర్పుకాపు సాధికార అధ్యక్షులు పల్లి సురేష్‌తో పాటు గ్రామస్థులు అన్నారు. కార్యక్రమంలో జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు, వివిధ విభాగాలకు చెందిన పోలీస్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రయ్య మృతి బాధాకరం

ఆమదాలవలస, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బొబ్బిలిపేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చంద్రయ్య మృతి బాధాకరమని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం బొబ్బిలిపేట వెళ్లి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వంజంగి గ్రామంలో జడ్పీటీసీ బెండి గోవిందరావు భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబాని, తమ్మయ్యపేట గ్రామంలో కలవరం మాజీ సర్పంచ్ గురుగుబిల్లి అప్పారావు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వైసీపీ నాయకులు కోట గోవిందరావు, బొడ్డేపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి వ్యాన్ బోల్తా

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి జర్నలిస్ట్ కాలనీ రోడ్డులో బుధవారం ఈ రహదారి గుండా వచ్చిన సప్లయర్స్ సామగ్రితో వస్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో గతంలో కూడా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఈ రహదారిని పక్కా రోడ్డుగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


బోల్తాపడిన వ్యాన్

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి, బంగారు పతకాలు సాధించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. రాష్ట్రస్థాయి తైక్వాండోలో బంగారు పతకాలు సాధించిన చిన్నారులను ఆమె సత్కరించారు. గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు కాకినాడ జేఎన్టీయూ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫస్ట్ ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండ్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తాచాటి.. ఓవరాల్ చాంపియన్ షిప్‌లో మూడో స్థానం కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కాళ్ల దిలీప్, 15వ వార్డు కౌన్సిలర్‌కి చెందిన పిలక విజయ్ భాస్కర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు బి.కృష్ణయ్య, సీహెచ్ లోహిదాస్‌రెడ్డి, బి.వెంకటరమణ, ఎల్‌సీ రావు, కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


విప్ అశోక్‌ను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

సోంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని సోంపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఒక్క ప్రైవేట్ బస్సు కూడా రావడం లేదని, దీనివల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయన్నారు. పట్టణంలో 30రకాల వ్యాపార సంస్థలు ఉన్నాయని, వీటన్నింటిని కలిపి చాంబర్ ఆఫ్ కామర్స్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అధ్యక్షుడు మల్లా నాగేంద్ర, కార్యాదర్శి కొంచాడ రాంజీ, సానా రవి, సిందిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

8 నుంచి నాటక పరిషత్ పోటీలు

కవిటి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బొరివంక గ్రామంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నాటక పరిషత్ పోటీలు నిర్వహించనున్నట్టు కళింగసేవ కళాపీఠం అధ్యక్షుడు బి.లక్ష్మణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బి.అనసూయమ్మ స్మారక ఆహ్వానిత నాటక పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారులు వచ్చి ప్రదర్శనలు ఇవ్వనున్నారన్నారు. ప్రతీరోజూ రాత్రి 7గంటలకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ రిఫరీగా అజయ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా పి.అజయ్ కుమార్‌ను నియమిస్తూ భారత బాల్ బ్యాడ్మింటన్ సమాఖ్య నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 6 నుంచి కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఆయన న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఈయన ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.


అజయ్‌కుమార్

లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి

అరసవల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. తొలుత ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, సీఐటీయూ నాయకులు అల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

కంచిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రానున్న పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించాలంటే ఇష్టపడి చదవాలని ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీఈ వసతి గృహాన్ని బుధవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రాత్రి భోజనాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వార్డెన్ గుల్ల రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో సేవలు అందించాలి

కంచిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. బుధవారం బొగాబోని, కంచిలి-1 సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్లు వారి లాగిన్‌లో నమోదు చేసిన సేవల రుసుం ఎప్పటికప్పుడు చలానా తీసి ప్రభుత్వం ఖాతాలో జయచేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్(చిన్ను) అన్నారు. బుధవారం దూసి గ్రామంలో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఏటీఎం పిన్‌కోడ్, అకౌంట్ నెంబర్లు అడిగితే ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ఎ.హరినాథ్, సీఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్, కె.సంతోషి కుమారి పాల్గొన్నారు.

8న వేంకటేశ్వరస్వామి శోభాయాత్ర

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న వేంకటేశ్వర స్వామివారి శోభాయాత్ర నిర్వహించనున్నట్టు టీటీడీ ధర్మ ప్రచారక్ మేనేజర్ లలితమణి బుధవారంఒ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీష్మ ఏకాదశి సందర్భంగా పీఎన్ కాలనీలో గల నారాయణ తిరుమల ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. నాగావళి వంతెన నుంచి ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్ మీదుగా.. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కోలాటం, చెక్క భజనలు, వాయిద్య బృందాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

ఆరోపణలపై విచారణ

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సన్యాసిపుట్టుగ గ్రామ సంఘం వీవోఏపై కేశుపురం ఎంపీటీసీ చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఏపీఎం సనపల ప్రసాద్ అధ్యక్షతన సంఘ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ రామ్మోహన్‌రావు పాల్గొని వివరాలు సేకరించారు. దీనిపై నివేదికను డీఆర్‌డీఏ పీడీకి అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ప్రసాద్, శ్రీనిధి మేనేజర్ రాము, సీసీ లక్ష్మి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంఘంలోని అవినీతిపై విచారించాలి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలం కొరసవాడలోని ఓ చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని జాతీయ చేనేత సలహా సంఘం పూర్వ సభ్యులు మంచు కృష్ణారావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను కార్మికులకు అందించకుండా ఆ సంఘ అధ్యక్షుడు దోచుకుంటున్నాడని ఆరోపించారు. ఆడిట్‌లో 370 మంది ఆ సంఘంలో సభ్యులు ఉన్నట్టు చూపించారని, కానీ ప్రభుత్వం నియమించిన పీఐసీకి 132 మంది ఉన్నారని, వీరిలో 28 మందికి మాత్రమే మగ్గాలు ఉన్నాయన్నారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు తనవద్ద ఉన్నాయన్నారు. గతేడాది జూలై 1న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆ సంఘంలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు జనగ అప్పారావు, గణపతి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బూర్జ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధ పడుతున్న పలు కుటుంబాలను ఆమదాలవలస నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. ఓవీ పేటకు చెందిన బగాది నారాయణమూర్తిని, అక్కివరం సర్పంచ్ గురుగుబెల్లి నీలారావు, దివంజిపేటకి చెందిన గోవిందరావును పరామర్శించారు.

ఉత్సాహంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు


నామసంకీర్తనలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధిలోని గోశాల, రాధాకృష్ణ మందరం ఆలయం ప్రాంగణంలో గత మూడు రోజులుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన అధ్యక్షుడు కేశవ గోస్వామి మహరాజ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి సాధువులు, వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం నుంచి చయాధివాసం, ధాన్యాధివాసం పూజా కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈనెల 7న జగనున్న జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాల ప్రతిష్ఠపై భక్తులకు వివరించారు. సాధువులు, స్వామీజీలతో కలసి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం రామతీర్థం జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై సాధువులు చేపట్టిన నామ సంకీర్తనలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, డీజీఎం శ్రీనివాసరావు, రౌతు అప్పలనాయుడు, బాలి శ్రీనివాసరావు, కలిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలువ కప్పేసి.. ఇసుక తరలింపు

● వంద ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నీరందని వైనం ● ఆందోళన చెందుతున్న 4ఆర్ కాలువ రైతులు


ఇసుక అక్రమ రవాణా కోసం సాగునీటి కాలువ పూడ్చివేసిన దృశ్యం

హిరమండలం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోతోంది. వంశధార నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేసేందుకు ఏకంగా వంద ఎకరాలకు సాగునీరందించే కాలువను సైతం కప్పేశారు. దీంతో రబీలో సాగుచేసిన పంటలకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని మహాలక్ష్మీపురంతోపాటు నీలాదేవిపురం, పిండ్రువాడ గ్రామాలకు చెందిన పంట భూములకు వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిధిలో 4ఆర్ కాలువ ద్వారా నీరందిస్తున్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలో వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకొచ్చారు. దీంతో కొందరు వంశధార నదిలో ఇసుక అక్రమ రవాణా చేపట్టారు. అంబావల్లి, భగీరథపురం గ్రామాల వద్ద వంశధార నది నుంచి రాత్రిపగలు తేడాలేకుండా యంత్రాలతో ఇసుకను తవ్వి లారీలు, ట్రాక్టర్లు ద్వారా తరలిస్తున్నారు.నదిలోకి ట్రాక్టర్లు వెళ్లేందుకు రహ దారులను సైతం నిర్మించారు. అడ్డంగా ఉండడంతో మూడు చోట్ల కాలువ పూడ్చి రహదారి నిర్మించడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో వంద ఎకరాలకుపైగా మొక్క జొన్న పంటకు సాగ నీరందడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. కాగా వంశధార ఎడమ ప్రధానకాలువ పరిధిలో పిల్లకాలువను పలు చోట్ల పూడ్చి వేయడంపై వంశధార డీఈ గణేష్‌కు బుధవారం ఆయకట్టు రైతులు ఫిర్యాదుచేశారు. ఇసుకు అక్రమ రవాణా చేసేందుకు అనువుగా 4ఆర్ కాలువను పలుచోట్ల పూడ్చివేశారని తెలిపారు. దీంతో మొక్కజొన్న పంటకు నీరందక పంట ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రెయిలింగ్ కూలి.. వంతెన శిథిలావస్థకు చేరి

● భయాందోళన చెందుతున్న వాహనచోదకులు ● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం ● ఇదీ నారాయణపురం ఎడమ కాలువ వద్ద పరిస్థితి


కాలువలోకి కూలిపోయిన వంతెన రెయిలింగ్

బూర్జ,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని నారాయణపురం, లాభాంగ్రామాల మధ్య నారాయణపురం ఎడమ కాలువ వంతెనపై రెయిలింగ్ కూలిపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్ కాలువలోకి కూలిపోవడంతో ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వాహనచోదకులు ఏమరపాటున ఉంటే నదిలోకి దూసుకు వెళ్లే ప్రమాదముందని చెబుతున్నారు.రెయిలింగ్ కూలిపోయి నెలలు గడుస్తున్నా కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటుచేయలేదని పలువురు వాపోతున్నారు. నాగావళి నది వంతెన నిర్మాణం అనంతరం రాజాం నుంచి కొల్లివలసకు భారీ వాహనాలు ఎడమ కాలువ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీ వల రాజాం నుంచి కొల్లివలసకు వస్తున్న ఓ లారీ శిథిలావస్థలో ఉన్న వంతెన మీదుగా రావడంతో రెయిలింగ్ కూలిపోయి కాలువలో పడిపోయింది. దీంతో వంతెన కూడా ఏ క్షణంలో కూలిపోతుం దోనని ఆయా గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గం నుంచి గుత్తావల్లి, లాభాం, లంకాం, మామిడివలస, వావాం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు చొరవ తీసుకొని కొత్తగా వంతెనను నిర్మించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

32 మద్యం సీసాల స్వాధీనం

జలుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దదూగాంలో బుధవారం తెల్లవారుజామున సిబ్బందితో దాడి చేసి గ్రామానికి చెందిన రామారావు వద్ద నుంచి 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లుఎక్సైజ్ సీఐ గాయిత్రి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐదు లీటర్ల సారా..

పలాస రూరల్,ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రెంటికోటలో బుధవారం దొతియ పార్వతి ఐదు లీటర్ల సారాతో పట్టుబడినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

బాలలను పనిలో పెడితే చర్యలు


బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికశాఖ అధికారి జయశంకర్

నరసన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెడితే చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ అధికారి వి. జయ శంకర్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో బాలకార్మికవ్యవస్థ నిర్మూలన, వెట్టిచాకరీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 18సంవత్సరాల్లోపు బాలకార్మికులు ఎక్కడైనా పనిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోర్డినేటర్ పూడి జనార్దనరావు, ఎంఆర్‌పీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

● కార్మిక సంఘాల నాయకుల డిమాండ్


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

పలాసరూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలని వివిధ కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్లుగా మార్చిందని, ఇప్పుడు వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని ఒత్తిడి చేయడం తగదని పేర్కొన్నారు. బుధవారం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసీసీటీయూ అనుబంధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత పలాస జీజే కళాశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికసంఘాల నాయకులు కె.కేశవరావు, ఎస్.మోహనరావు, ఎస్.గణపతి, సీహెచ్ వేణుగోపాల్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

జీడిపంటను కేంద్ర పంటల జాబితాలో చేర్చి మద్దతు ధర ప్రకటించాలని జీడి రైతుసంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మాకన్నపల్లిలో కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి తగిన కేటాయింపులు లేకపోవడంతో2025-26 బడ్జెట్ కాపీలను ఆంధ్రప్రదేశ్ జీడి రైతుసంఘం ఆధ్వర్యంలో దగ్ధంచేశారు.ఈసందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు తగ్గించడం,కొత్తసాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తెప్పల అప్పలస్వామి, గేదెల నీలకంఠం, బత్తిన ప్రసాద్, తెప్పల రాజు, జుత్తు వరలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహించండి

● డ్వామా జిల్లా విజిలెన్స్ మేనేజర్ స్వరూపారాణి


మాట్లాడుతున్న స్వరూపారాణి

టెక్కలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏప్రిల్, 2024 నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై సోషల్‌ఆడిట్ క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని డ్వామాజిల్లా విజిలెన్స్ మేనేజర్ స్వరూపారాణి కోరారు. బుధవారం స్థానికమండలపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు,ఇంజనీరింగ్, ఫీల్డ్‌అసిస్టెంట్లు,సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో రూ.18 కోట్ల నిధులు వివిధరూపాల్లో వెచ్చించామని, ఎస్ఆర్‌పీ, ఆరుగురు డీఆర్పీలు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి ప్రజావేదికకు రిపోర్టు సిద్ధంచేయాలన్నారు. 15 రోజుల పాటు గ్రామాల్లో సోషల్‌ఆడిట్ బృందం విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీభాయి, ఏపీడీశైలజ, ఏపీవో ప్రసాద్, ఎస్ఆర్‌పీ రామచంద్రరావు పాల్గొన్నారు.


క్రీడాపోటీల్లో సత్తాచాటిన నందిగాం విద్యార్థులు

నందిగాం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నందిగాం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు టెక్కలి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో సత్తాచాటారు. తొమ్మిదో తరగతి విద్యార్థి కోనారి హర్షవర్ధన్ 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంతోపాటు లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం సాధించి వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించాడని హెచ్‌ఎం వై.హరిబాబు, పీడీ జి.శ్రీనివాసరావులు తెలిపారు. సీనియర్‌విభాగంలో 400మీటర్ల పరుగుపందెంలో పదోతరగతి విద్యార్థి సనపల కృష్ణకిషోర్ తృతీయ స్థానం,టెన్నికాయిట్‌లో ఏడోతరగతి విద్యార్థినులు బరిడశ్రీనిధి, నర్సిపురం పూజిత, సారవకోటలిఖిత, సోనియాలు ప్రథమ స్థానంపొందారని తెలిపారు.ఈమేరకు విద్యార్థులను హెచ్‌ఎం,పీడీలతో పాటు ఉపాధ్యాయులు, ఎస్ఎంసీచైర్మన్, సభ్యులు, గ్రామపెద్దలు అభినందించారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

నందిగాం, ఫిబ్రవరి 5(నందిగాం): మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని ఎంపీడీవో టి.రాజారావు కోరారు. బుధవారం మండలంలోని జయపురంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు.ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతి, హాజరు పట్టీ, ఉపాధ్యాయుల హాజరు, మెనూ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతోమాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సింహాచలం, వార్డెన్ ప్రకాశరావు, కార్యదర్శి కె.గోపినాథ్ పాల్గొన్నారు.

అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు లిటిల్ ఏంజిల్స్ స్కూల్ విద్యార్థిని


నిత్యశ్రీకశ్యప్

కాశీబుగ్గ, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తిలక్‌నగర్‌లో గల లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న ఎస్.నిత్యశ్రీ కశ్యప్ ఈనెల తొమ్మిదో తేదీన విజయవాడలో జరిగే అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల రెండో తేదీన శ్రీకాకుళంలో జరిగిన అబాకస్ పరీక్షలో జిల్లాస్థాయి 600 మంది హాజరు కాగా నిత్యశ్రీ కశ్యప్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అంకగణితంలో సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగాహారం వంటి చతుర్విధప్రక్రియలను సులువుగా ఆకలింపుచేసుకుని విద్యార్థుల నైపుణ్యతకు అద్దం పట్టే పరీక్షలో ప్రతిభ కనబరిచిన నిత్యశ్రీ కశ్యప్‌ను అభినందించారు. ఈమేరకు ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


జలుమూరు: బొడ్డపాడులో సత్యనారాయణస్వామికి పూజలు చేస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భక్తిభావం పెంపొందించుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. బుధవారం మండలంలోని బొడ్డపాడు సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తిభావం పెరిగితే మనిషి సన్మార్గంలో నడచుకుంటాడన్నారు.కార్యక్రమంలో టీడీపీమండలాధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, సర్పంచ్ అంపోలు తిరుపతిరావు, టీడీపీ నాయకులు గోవిందరావు, కనుసు రవి, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

శివరాత్రిని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు కృషి

నరసన్నపేట/జలుమూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను రాష్ట్ర పండగగా గుర్తించేందుకు కృషి చేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఈనెల 26 నుంచి 28 వరకు జరిగే శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థస్నానాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు సర్పంచ్ టి.సతీష్‌కుమార్, అర్చకులు,ఆలయ కమిటీ సభ్యులు బుధవారం క్యాంపు కార్యాలయంలోఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి ఆహ్వానించారు. శ్రీముఖలింగంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవ, భైరి బలరాం, అర్చకులు శేషాద్రి వెంకటాచలం, అప్పారావు, శివ పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరాలయంలో పోస్టర్ ఆవిష్కరణ

పాతపట్నం,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని నీలకంఠేశ్వరాలయంలో నిర్వహించనున్న శివరాత్రికి సంబంధించిన పోస్టర్‌ను ఐఆర్ఎస్ అధికారి, జీఎస్టీ కమిషనర్ పూజారి కృష్ణారావు బుధవారం ఆవిష్కరించారు. సారవకోట మండలంలోని గంగాధరపేట గ్రామానికి చెందిన కృష్ణారావు జిల్లాలోని ప్రముఖ ఆలయాల సందర్శనలో భాగంగా శ్రీనీలకంఠేశ్వరుని ఆలయాన్ని దర్శించుకున్నారు. దేవదాయశాఖ సిబ్బంది, అర్చకులు స్వాగతంపలికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది సుదర్శన్,ప్రధానఅర్చకులు రుద్రపంక్తి పార్వతీశం,కళ్యాణస్వామి పాల్గొన్నారు.

రెండు డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిలో అలుమ్నిఆఫ్ నార్త్ అమెరికా(ఏఎంసీఏఎన్ఏ) సహకారంతో రెండు డయాలసిస్ యూనిట్లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.ఆంధ్రామెడికల్ కళాశాలకు చెందిన ఎన్ఆర్ఐ వైద్యులకు పలాసలో డయాలసిస్ యూనిట్లు అందించాలని తాను గతంలో లేఖ రాయడంతో సానుకూలంగా స్పందించారని తెలిపారు. రూ.15 లక్షల విలువైన రెండు డయాలసిస్‌యూనిట్లు నెలాఖరుకు రానున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ యూనిట్లు చాలకపోవడంతో ప్రభుత్వం ఇప్పటికే కొత్తగా యూనిట్లు ఇవ్వడానికి రంగం సిద్ధంచేసిందని తెలిపారు. దీంతోపాటు దాతలవిరాళంతో ఇచ్చిన యూనిట్లతో కొత్తగా డయాలసిస్ చేయడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

కాలువలు శుభ్రం చేయండి: కమిషనర్


పారిశుధ్య నిర్వహణపై సూచనలిస్తున్న కమిషనర్ రామారావు

పలాస, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ ఎన్. రామారావు కోరారు. బుధవారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయంలో సచివాలయ పారిశుధ్య సిబ్బంది, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యర్థాలను తగ్గించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలని, అన్నీ వీధుల్లో ఓపెన్‌డ్రెయిన్లల్లో లార్వా ఆపరేషన్ చేయాలని, ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు పారిశుధ్యంపై చైతన్యం చేయాలని ఆదేశించారు. కాగా వేకువజామున సిబ్బంది పనితీరుపై కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ పారిశుధ్య సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు. కాగా కాశీబుగ్గ ఉన్నతపాఠశాల వద్ద గల ఏపీఎన్జీఓ కార్యాలయం పరిసరాలు పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ సంఘ అధ్యక్షుడు బోనెల గోపాల్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఉదయ్‌శంకర్‌పాత్రో కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యాలయం ఆవరణలో మంచినీటి వసతి కల్పించాలని కోరారు.

లైసెన్స్ లేకుండా వాహనం నడపవద్దు


మాట్లాడుతున్న ప్రసన్నలత

కోటబొమ్మాళి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత సూచించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో కళాశాల, జడ్పీ బాల బాలికల పాఠశాల విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే శిక్షలు, జరిమానాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంతోషి, హెచ్‌ఎంలు గోవిందరావు, రామాదేవి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి

నరసన్నపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని టెక్కలి ఎంవీఐ డి. సంజీవరావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అసిరినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, సామాజిక ఆసుపత్రి వైద్యులు బలగ రమేష్, అధ్యాపకులు జి. రవికుమార్ పాల్గొన్నారు.

జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పలాస కేంద్రంగా జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు రాష్ట్ర అగ్రికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని బీసీ భవన్‌లో అగ్రికుల క్షత్రియ కార్పొరేషన్ బోర్డు సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ ఉమాదేవి అధ్యక్షతన జరిగిందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ చిలకలపూడి పాపారావుకు సమక్షంలో జీడిపరిశోధన కేంద్రానికి ప్రతిపాదన చేయగా బోర్డు సభ్యుల నుంచి మద్దతు లభించిందని చెప్పారు.

దరఖాస్తుల గడువు పెంపు

పలాస రూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి):కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు గడువు ఈనెల ఎనిమిదో తేదీ వరకూ పొడిగించినట్లు ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించు కోవాలని కోరారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

జలుమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) రబీలో కూడా ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి తెలిపారు. బుధవారం మండలంలోని వెలుసోదలో సాగుచేస్తున్న రబీ పంటలను సూపర్‌చెక్‌లో భాగంగా రాండమ్‌గా కేటాయించిన సర్వే నెంబర్లను జియో కోఆర్డినేటర్లతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీలు కె.రవీంద్రభారతి, భవానీశంకర్, ఏవో కె.సురేష్, వీఏఏలు పాల్గొన్నారు.

● నరసన్నపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రబీలో రైతుల పండించే పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే నమోదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి కోరారు. మడపాం లో రబీ పంటలను సూపర్‌చెక్ కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మెళియాపుట్టి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని సచివాలయ, వైద్య సిబ్బంది సూచించారు. బుధవారం గోడ్డ ఆరోగ్యఉప కేంద్రంలో కేరాసింగి సచివాలయ, వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చందక సంతోషి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రాప్తికి నియామకాలు

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న పనులకు సంబంధించిన మేట్లను ప్రభుత్వ నిబంధనలకు ప్రాప్తికి అనుగుణంగా నియామకాలు చేపట్టనున్నట్లు ఏపీవో శ్రీదేవి తెలిపారు. బుధవారం ఎల్ఎన్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ కూలీలు వలసలు వెళ్లకుండా ఉండేందుకు జరుగుతున్న పనులను చేయించేందుకు మేట్లుగా ఉండాలంటే 25 నుంచి 50మంది గ్రూపులో ఉంటూ 2023- 24 ఏడాదిలో 25 రోజులు పనిదినాలు చేసి ఉండాలన్నారు.

పంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వ


పంచాయతీ కార్యాలయంలో ధాన్యం బస్తాలు నిల్వ ఉన్న దృశ్యం

నందిగాం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపురంలో గల పంచాయతీ కార్యాలయం ధాన్యం బస్తాలు నిల్వచేయడంపై విమర్శలకు తావిస్తోంది. దేవళభద్రకు వెళ్లే మార్గంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ భవనాన్ని ప్రజల అవసరాలకు వినియోగించకుండా ధాన్యాన్ని నిల్వ చేయడం విశేషం. పంచాయతీ కార్యాలయం ధాన్యం నిల్వ చేయడం తగదని గ్రామస్థులు చెబుతున్నారు. కాగా ఇప్పటికే గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చిందని, పంచాయతీ కార్యదర్శి ద్వారా ధాన్యం బస్తాలను తొలగించడానికి చర్యలు చేపట్టామని ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు.

పైకప్పులు లేవు.. పూడిక తీయరు

● లాభాంలో గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ


కాలువపై పైకప్పు ఏర్పాటుచేయని దృశ్యం

బూర్జ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని లాభాంలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. రోజుల తరబడి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దుర్గంధం వెలువడుతోంది. వైసీపీ ప్రభుత్వహయాంలో కాంక్రీట్‌తో కాలువలు ఏర్పాటు చేశారు. అప్పట్లో వాటిపై పైకప్పు వేయకుండా అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. దీంతో మురుగు నీరు పేరుకుపోవడంతోపాటు చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వృద్ధులు, పిల్లలు, మహిళలు కాలువల్లో పడిగాయపడుతున్నారు. సుమారు 500 మంది నివసిస్తున్న ఈ గ్రామంలో రెండేళ్ల కిందట కాలువలు ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి కాలువల్లో చెత్తపేరుకుపోవడంతోపాటు మురుగు నీరు నిల్వఉండడంతో అవస్థలకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తొలగించి, పలకలు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిధులు ఖర్చుచేసినా.. నీటి సమస్య తీరలేదు

● దిష్టిబొమ్మలా మారిన కొళాయిలు ● గోపీవల్లభపురం నుంచి నీటిని తీసుకొస్తున్న మహిళలు ● ఇదీ ముడిఖండిబద్రలో పరిస్థితి


దిష్టిబొమ్మలా మారిన జేజేఎం నిధులతో ఏర్పాటు చేసిన కొళాయిలు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడిఖండి బద్ర గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలు (జేజేఎం) ఖర్చుచేసినా తాగు నీటి సమస్య పరిష్కారం కాలేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇంటింటికి కొళాయిల ఏర్పాటుకు నిధులు ఖర్చు చేసినా బోరు తవ్విన చోట నీరు పడకపోవడంతో నిష్ప్రయోజనంగా మారింది.దీంతో కొళాయిలు దిష్టిబొమ్మల్లా మారాయి. గ్రామంలో 150 కుటుంబాల దాహార్తిని తీర్చడానికి జేజేఎం నిధులతో బోరు, రక్షిత మంచినీటి పథకం, కొళాయిలు ఏర్పాటుచేశారు. మోటర్, ట్యాంక్ నిర్మించినా నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామానికి చెందిన మహిళలు కిలోమీటరు దూరంలో గల పలాస మండలంలోని గోపీవల్లభపురం గ్రామానికి వెళ్లి కుండలతో నీటిని తీసుకొస్తున్నారు. గ్రామంలో ఓ వీధిలో 20 గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలు ఉంటున్నాయి. ఆ వీధిలో కనీసం బోరు, బావి లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలోని పలాస మండలంలోని గ్రామాల నుంచి నీటిని తీసుకురావాల్సివస్తోందని మహిళలు వాపోతున్నారు. కొందరు మహిళలు ట్యాంకు వద్దకు వెళ్లిని నీటిని పట్టుకుంటున్నారు. లక్షలాది రూపాయలు నిధులు ఖర్చుచేసినా నీటి సమస్య తీరకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


పలాస మండలంలోని గోపీవల్లభపురం నుంచి కుండలతో నీటిని తీసుకువస్తున్న మహిళలు